క్లుప్తంగా

ఎగ్జిబిషన్ ప్రారంభం..



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కాశ్మీరీ జలకన్య ఎగ్జిబిషన్‌ను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడగా సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సాబీర్ పాషా, ఎగ్జిబిషన్ నిర్వాహకులు తుమ్మ అప్పిరెడ్డి, ఉమామహేశ్వరరాజు, అమర్లపూడి బాలశౌరి, తంబి, ప్రకాష్, నాయకులు ఖురేషి, తూము చౌదరి, పూనం శ్రీను, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

టేకులపల్లి: ఇల్లెందు డీఎస్పీ నూనావత్ చంద్రభాను మంగళవారం బోడు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించి, వివిధ విభాగాలపై సమీక్ష నిర్వహించారు. పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజల సమస్యలను శీఘ్రంగా పరిష్కరించాలని, స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడే క్రమంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ పొడిశెట్టి శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ

టేకులపల్లి: ఈనెల 11,12,13 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఏకలవ్య పాఠశాలలో జరిగిన 5వ ఈఎంఆర్ఎస్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో టేకులపల్లి ఈఎంఆర్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్రంలోని 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) విద్యార్థులు వాలీబాల్, ఖోఖో క్రీడల్లో పాల్గొనగా టేకులపల్లి ఈఎంఆర్ఎస్ విద్యార్థులు వాలీబాల్, ఖోఖో క్రీడల్లో ప్రథమ స్థానంతో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. త్వరలో ఒడిశాలో జరగబోయే నేషనల్ క్రీడలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ నిశాంత్, కృష్ణ, పీఈటీ మహేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడల్లోనూ రాణించాలి

పాల్వంచరూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మండల విద్యాశాఖ అధికారి శ్రీరామ్మూర్తి అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులు జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడాపోటీలను మంగళవారం ఎంఈఓ ప్రారంభించారు. 24 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొనగా తొలిరోజు బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు.

రాజీలేని పోరాటం చేస్తాం..



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రగతిశీల విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా 3వ మహాసభ సందర్భంగా మంగళవారం పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించి ఉర్దూఘర్‌లో మహాసభ నిర్వహించారు. యూనియన్ మాజీ ఉపాధ్యక్షుడు అప్పారావు మాట్లాడుతూ స్టూడెంట్ యూనియన్ ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈరోజు, రేపు కొత్తగూడెంలో నిర్వహిస్తున్నామని ఈ సంఘం తెలుగు నేలపై చరిత్రలో నిలిచిపోయే విధంగా విద్యార్థుల పక్షాన నిలుస్తూ రాజీలేని పోరాటాలు నిర్వహించిందన్నారు. రాజీరెడ్డి మొదలు ఎందరో విద్యార్థులు తమ నిండు ప్రాణాలు అర్పించి ఉద్యమానికి ఊతమిచ్చారన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వం నుంచి తప్పిస్తూ నేటి విద్యార్థి శక్తిని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఎ.సాంబ, కొమరం సత్యానారాయణ, కందగట్ల సురేందర్, ఉప్పరబోయిన రామ్మూర్తి పాల్గొన్నారు.

విజిలెన్స్ వారోత్సవాలపై సమావేశం

కొత్తగూడెంఅర్బన్: నవంబర్ 17వ తేదీ వరకు నిర్వహించనున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో పీఎంపీఎఫ్, సింగరేణి యాజమాన్యం అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జీఎం(విజిలెన్స్) కే.ప్రసాదరావు, జీఎం(పర్సనల్) వెల్ఫేర్ – సీఎస్ఆర్ జీవీ కిరణ్ కుమార్, సీఎంపీఎఫ్ఓ ఏవై, ఆర్‌సీ భరత్ కుమార్ హాజరయ్యారు. మాట్లాడుతూ ఈ ఏడాది 'విజిలెన్స్ మా భాగస్వామ్య బాధ్యత 'అంశం వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సంస్థలోని ఉద్యోగులందరూ నిబంధనల మేరకు పనిచేస్తూ వారి విధులను నిజాయితీగా నిర్వహిస్తూ సంస్థలోని ఉద్యోగులు చుట్టుపక్కల జరిగే అవినీతి పై ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకొచ్చి అరికట్టే విధంగా కృషి చేయాలని కోరారు.

ఎదురుచూపులు ఇంకెన్నాళ్లు?

- నేటికీ పరిష్కారం కాని సాంకేతిక సమస్య
- ఇళ్లు నిర్మించి అప్పులపాలైన లబ్ధిదారులు
- పైలెట్ గ్రామంలో వెంటాడుతున్న 'ఇందిరమ్మ' కష్టాలు





పూబెల్లిలో స్లాబ్ పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు, నిలిచిపోయిన ఇంటి నిర్మాణం

ఇల్లెందురూరల్: సొంత గూడు లేని పేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా ప్రభుత్వం ఇళ్ల మంజూరు చేసింది. నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందజేస్తోంది. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మండలంలోని పూబెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా సాగింది. కానీ బిల్లుల మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

గ్రామంలో 83 ఇళ్ల మంజూరు...

పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన పూబెల్లిలో అర్హులుగా గుర్తించి 83 మందికి ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇళ్లు మంజూరు చేశారు. ఈ పథకం మార్చి 16న రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ఇళ్లు మంజూరైన పేదలు ఉన్న గుడిసెలను తొలగించి చిన్నపాటి గూడు ఏర్పాటు చేసుకొని ఇంటి నిర్మాణం ప్రారంభించారు. ఈ క్రమంలో బేస్‌మెంట్ లెవల్‌కు చేరుకున్న 54 ఇళ్లకు తొలి విడత బిల్లు రూ.లక్ష అందాయి. దీంతో లబ్ధిదారులు అప్పు చేసి మిగతా ఇంటి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేశారు. 12 ఇళ్లు స్లాబ్ పూర్తి, 30 ఇళ్లు స్లాబ్ లెవల్‌లో ఉన్నాయి. 27 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ దాటాయి. 14 ఇళ్లు నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు.

నెలలు గడిచినా లభించని పరిష్కారం..

పూబెల్లి గ్రామంలో సెల్ సిగ్నల్స్ సక్రమంగా లేకపోవడంతో ఇంటి నిర్మాణాలను ఆఫ్‌లైన్‌లో చిత్రీకరించి సిగ్నల్‌లోకి వచ్చిన తరువాత తిరిగి నిర్దేశిత ఇందిరమ్మ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ గడిచిన రెండు నెలలుగా సాంకేతిక సమస్య పేరుతో నిలిచిపోవడం లబ్ధిదారులకు శాపంగా మారింది. ఇదే విషయాన్ని స్వయంగా స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య కలెక్టర్, గృహ నిర్మాణశాఖ ఎండీకి వివరించినా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. కలెక్టర్ ఆదేశంలో సెల్ సిగ్నల్ పునరుద్ధరణ కోసం పూబెల్లి గ్రామాన్ని సందర్శించిన బీఎస్ఎన్ఎల్ అధికారులు సమస్యను పరిష్కరించలేకపోయారు. దీంతో బిల్లులు మంజూరు కావడం లేదన్న కారణంతో నూరు శాతం నిర్మాణాలు పూర్తి కావాల్సిన పూబెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి.

భారంగా మారుతున్న అప్పులు..

ఇంటి నిర్మాణ దశల ఫొటోలను ఇందిరమ్మ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే దశల వారీగా ప్రభుత్వం బిల్లులు అందిస్తోంది. ఇలా బేస్‌మెంట్ లెవల్‌కు రూ.లక్ష, స్లాబ్ లెవల్‌కు రూ.1.25 లక్షలు, స్లాబ్ వేస్తే రూ.1.75 లక్షలు, ఇల్లు పూర్తి చేస్తే రూ.3లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తోంది. కానీ నిర్మాణం పూర్తి కావస్తున్నా లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. ఇప్పటి వరకు ఇంట్లో ఉన్న దానితో సరిపెట్టుకునే ఆదివాసీలు ఇందిరమ్మ పథకం పేరుతో అప్పుల కుంపటిని నెత్తిన పెట్టుకున్నారు. పొదుపు సంఘాల ద్వారా రూ.1.50 లక్షలు, ప్రైవేటుగా మరో రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు.. ఇలా మొత్తంగా ఒక్కొక్కరు రూ.3 లక్షల వరకు అప్పు చేసి వడ్డీలు ఎంత పెరుగుతాయోనన్న భయాందోళనలో ఉన్నారు.

రూ.3లక్షలు అప్పు చేశాం..



మా ఇంటి నిర్మాణానికి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. నిర్మాణం విషయంలో గ్రామానికి ఆదర్శంగా ఉండాలన్న పట్టుదలతో నిర్మాణం పూర్తి చేశాం. తొలి విడత మినహా బిల్లులు ఇవ్వలేదు. నిర్మాణం కోసం రూ.3లక్షలు అప్పు చేశాం.

– వర్స సుధ, పూబెల్లి

స్లాబ్ లెవల్‌లో నిలిపివేశాం..



సొంతింటి కల నెరవర్చుకునేందుకు నిర్మాణం వేగంగా చేపట్టాం. స్లాబ్ లెవల్ వరకు పూర్తి చేశాం. దీనికోసం రూ.2.30 లక్షలు అప్పు చేశాం. బిల్లులు మంజూరుకు సాంకేతిక సమస్య ఉందని అధికారులు చెబుతున్నారు. అప్పు చేసే స్తోమత లేక నిర్మాణం నిలిపివేశాం.

– చీమల నాగమణి, పూబెల్లి

ఉన్నతాధికారులకు వివరించాం..



పూబెల్లి గ్రామంలో సెల్ సిగ్నల్ సమస్య ఉంది. బిల్లుల మంజూరు కోసం ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో సాంకేతిక సమస్య ఉత్పన్నం కావడంతో పూబెల్లి గ్రామంలో మాత్రమే ఫొటోలు అప్‌లోడ్ కావడం లేదు. ఉన్నతాధికారులకు సమస్యను వివరించాం.

– స్వాతి, ఏఈ, గృహ నిర్మాణశాఖ, ఇల్లెందు

ఆర్థికాభివృద్ధి సాధించాలి



సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనార్టీ వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు చర్యలు చేపట్టాలని, వారి సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు రూపొందించి అమలు చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ముస్లిం మైనార్టీ కార్పొరేషన్, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా నియోజకవర్గంలో 120 మంది లబ్ధిదారులకు మంజూరైన కుట్టుమిషన్లను మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

615 మందికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు..

615 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేశారు. మాట్లాడుతూ విడతల వారీగా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలలో కొత్తగూడెం ఆర్డీఓ మధు, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు, డీఎస్పీ రెహమాన్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, తహసీల్దార్ పుల్లయ్య, నాయకులు ఎస్కే సాబీర్‌పాషా, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, సలిగంటి శ్రీనివాస్, నాగ సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్ పంచాయతీని తీర్చిదిద్దుతాం..

చుంచుపల్లి: ప్రజావసరాల అనుగుణంగా అభివృద్ధి పనులు పూర్తిచేసి శ్రీనగర్ గ్రామపంచాయతీని సుందరంగా తీర్చిదిద్దుతామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ గ్రామపంచాయతీలో రూ.14.5లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పూర్తయిన రోడ్లు, డ్రైయినేజీను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

జీఓ 64ను రద్దు చేయాలి..

హాస్టళ్లలో పనిచేసే గిరిజన కార్మికుల నోటి కాడ బువ్వ గుంజుకునే ప్రభుత్వ చర్యలు మానుకోవాలని, డైలీవేజ్ వర్కర్ల వేతనాలు తగ్గించే జీఓ 64, ఔట్ సోర్సింగ్ వర్కర్ల జీతాలు తగ్గించే జీఓ 527 రద్దు చేయాలని కోరుతూ మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సంబంధిత మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానన్నారు. దొడ్డ రవికుమార్, కె.సత్య, భూక్యా రమేష్, నూనావత్ విజయ్ పాల్గొన్నారు.

క్షౌరవృత్తిపై పేటెంట్ కల్పించండి..



సుజాతనగర్: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



జూలూరుపాడు: జెండా ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

పాల్వంచ: నాయీ బ్రాహ్మణులకు క్షౌ రవృత్తి పేటెంట్ హక్కు కల్పించాలని నాయీ బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు ఉప్పెర్ల పుల్లారావు అన్నారు. మంగళవారం కేటీపీఎస్ బీసీ అసోసియేషన్ హాల్‌లో సంఘం ఆధ్వర్యంలో వరల్డ్ బార్బర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షుడు కొమరవెల్లి రవీందర్.. కులదైవం ధన్వంతరి నాయీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. నాయీ బ్రాహ్మణులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడి ఉన్నారని, ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయన్నారు. సోములపల్లి బాలకృష్ణ, దేవరకొండ శ్రీనివాసరావు, శ్రీరాముల ఉదయ్‌కుమార్, మురళీ, రాంప్రసాద్, రాజు, వంశీ, మహేష్, శ్రీనివాస్, కృష్ణ, శ్రీను, సాయి, మణికుమార్, మోహన్, చంద్రగిరి తేజ, సురేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: మండల నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ క్షౌ రవృత్తిదారుల దినోత్సవాన్ని సుజాతనగర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముక్తేశ్వరరావు, మణికంఠ, శ్రీను, కాశయ్య, కృష్ణ, మల్లయ్య, పుల్లారావు, వినీల్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: నాయీ బ్రాహ్మణులు ఐక్యమత్యంతో హక్కుల కోసం కృషి చేసి ఆర్థికాభివృద్ధి సాధించాలని కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు మావునూరి రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని గోలియాతండాలో ప్రపంచ క్షౌ రవృత్తి దినోత్సవం సందర్భంగా సంఘం జెండా ఎగురవేశారు. అనంతరం మాట్లాడారు. మంగీలాల్, ఈది గణేష్, దామోదర్, రాజు, రామ్మోహన్, భద్రు, భద్రం, వీరు, సర్దార్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: ప్రపంచ క్షౌ రవృత్తిదారుల దినోత్సవాన్ని మంగళవారం జూలూరుపాడులో నాయీబ్రాహ్మణ సేవా సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి కుదురుపాక నిర్మల, మండల అధ్యక్షుడు కడియాల శ్రీను, జిల్లా కార్యవర్గ సభ్యుడు మాడుగుల నాగరాజు, కడియాల పుల్లయ్య, వల్లోజి రమేష్, కడియాల మణికుమార్, పెద్దారపు కృష్ణార్జున్‌రావు, మాడుగుల నరేష్, మార్కాపురం రాంబాబు, కడియాల నాగేశ్వరరావు, ఉప్పర్ల నాగేశ్వరరావు, వల్లోజి నరేష్, ముద్దునూరు బుచ్చిబాబు, వల్లోజి నాగరాజు, సైదులు, లతీపు, మధు పాల్గొన్నారు.

19న చలో గిరిజన సంక్షేమ కమిషనరేట్

టేకులపల్లి: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 19న టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే చలో గిరిజన సంక్షేమ కమిషనరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం టేకులపల్లి మండల అధ్యక్షుడు బి.మాన్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఏడాదిగా సమస్యలు పరిష్కారం చేయాలని కమిషనర్, సెక్రటరీ, మంత్రులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న హరిప్రియ

టేకులపల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తతండా(పి), ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ గ్రామ పంచాయతీలలో పర్యటించారు. కార్యకర్తల సమావేశంలో రాజకీయ సమీకరణలు, ఎన్నికల్లో గెలుపుపై చర్చించారు. రామా, పాపా, చందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవాల లోగో ఆవిష్కరణ



లోగో ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్

పాల్వంచరూరల్: ఐదు దశాబ్దాలుగా వేలాది గ్రామీణ విద్యార్థుల్లో విద్యా దీపాన్ని వెలిగించిన ఘనత కిన్నెరసాని గిరిజన గురుకుల విద్యాలయానిదే అని పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ అన్నారు. మండలంలోని కిన్నెరసాని డ్యామ్‌సైడ్‌లోని గిరిజన గురుకుల పాఠశాలను స్థాపించి 50 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 28న జరగనున్న స్వర్ణోత్సవాల కోసం రూపొందించిన ప్రత్యేక లోగోను మంగళవారం పాఠశాలలో పూర్వవిద్యార్థులు, ప్రిన్సిపాల్ రమేష్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఖాదర్, రిటైర్డ్ టీచర్ చక్రవర్తి ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. పాఠశాలను స్థాపించి 50 ఏళ్ల సందర్భంగా తలపెట్టిన స్వర్ణోత్సవ వేడుకలను విజవంతం చేయాలని కోరారు. పూర్వవిద్యార్థుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రదీప్ కుమార్, వెంకటరత్నం, శ్రీనివాసకుమార్, ఎం.సత్యనారాయణ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యకు అంగన్‌వాడీలే తొలిమెట్టు

ఇల్లెందురూరల్: పౌష్టికాహారం అందిస్తూ ఆటపాటలతో అక్షరజ్ఞానం అందిస్తూ ప్రాథమిక విద్యకు తొలిమెట్టుగా అంగన్‌వాడీ పాఠశాలలు కొనసాగుతున్నాయని ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్టు సీడీపీఓ అరుణకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పోషణ్ బి – పడాయి బీ పథకంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లి ఒడి నుంచి బుడిబుడి అడుగులు వేస్తూ వచ్చే చిన్నారుల పట్ల స్నేహపూర్వకంగా మెలుగుతూ వారికి క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని, వారికి నచ్చిన పద్ధతిలో అక్షరజ్ఞానం అందిస్తూ ప్రాథమిక విద్యాభ్యాసానికి సిద్ధం చేయాలని సూచించారు. చదువు పట్ల మమకారం పెరిగేలా వారిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత అంగన్‌వాడీ ఉపాధ్యాయులపై ఉంటుందని చెప్పారు. శిబిరంలో ఏసీడీపీఓ అర్చన, సూపర్‌వైజర్లు సక్కుబాయి, కొమరమ్మ, జయ, సరిత పాల్గొన్నారు.

ఓజోన్ పొరను కాపాడుకుందాం..



ఇల్లెందురూరల్: ఓజోన్ పొర ప్రాముఖ్యతను వివరిస్తున్న విద్యార్థులు

ఇల్లెందురూరల్: మానవాళి ఆరోగ్యకరమైన జీవనం సాగించేందుకు పర్యావరణాన్ని పరిరక్షించి ఓజోన్ పొరను కాపాడుకుందామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ ఓజోన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొక్కలు పెంచి వాతావరణంలో వేడిని తగ్గించాలని, ఆక్సీజన్ ఉత్పత్తిని పెంచాలని తద్వారా ఓజోన్ పొర బలంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు నందిని, ప్రమిత తదితరులు ఓజోన్ పొరపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓజోన్ డే నిర్వహించారు. విద్యార్థులకు వకృత్వ, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ పోలారపు పద్మ మాట్లాడుతూ ఓజోన్ పొర సూర్యుని నుంచి వచ్చే అల్ట్రావయలెట్ కిరణాలను ఆపి మన ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుతుందన్నారు. డాక్టర్ జె.మాధవి, వరప్రసాద్, కొండలరావు పాల్గొన్నారు.

సాయుధ పోరాటం చరిత్రాత్మకం

ఇల్లెందు: భూమి, భుక్తి, విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రాత్మకం అని సీపీఎం జిల్లా నాయకుడు ఎస్ఏ నబీ అన్నారు.

మంగళవారం ఇల్లెందు సీపీఎం కార్యాలయంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. నైజాం సర్కార్‌కు దేశ్‌ముఖ్, జమీందార్, జాగీర్‌దార్లకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో జరిగిన వీరోచిత రైతాంగ పోరాటమని, పది లక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్టులు, పేదలకు పంచిపెట్టారని, మూడు వేల గ్రామాలకు విముక్తి అభించిందన్నారు. ఈ సందర్భంగా 3,500 మంది కమ్యూనిస్టులు తమ ప్రాణాలను బలి ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రావు, బోస్, సురేష్, సంతోష్, సుజాత, వెంకన్న, వీరభద్రం, హసీనా, కమల, సరిత, రాజు, నీలారాణి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికీ విలీన దినోత్సవమే..



జెండా ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఇల్లెందు/ఇల్లెందురూరల్: సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విలీన దినోత్సవం జరపాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య అన్నారు. మంగళవారం ఇల్లెందులోని విఠల్‌రావు భవన్‌లో విఠల్‌రావు విగ్రహం వద్ద, 21పిట్ ఏరియాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. మాట్లాడుతూ తెలంగాణ విలీన దినం కాకుండా ఇంకా ఏ పేరు పెట్టినా మహత్తర తెలంగాణ సాయుధ పోరాటాన్ని విస్మరించడం అవుతుందన్నారు. రాచరికం రద్దుకై జరిగిన ప్రజా పోరాటానికి మతం, కులం, రంగు పులమొద్దన్నారు. నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఫ్యూడల్ ప్రభువుల అణిచివేత దోపిడీలకు వ్యతిరేకంగా జరిపిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, మాతృభాష, భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం మట్టి మనుషులు చేసిన తిరుగుబాటు ధిక్కారం.. దొర ఏందిరో.. నీ దొరతనం ఏందిరో అంటూ బంధూకులు పట్టిన కమ్యూనిస్టు పోరాటమన్నారు. హైదరాబాద్ సంస్థాన రాజు జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాములు దాదాపు 90 శాతం దొరలు నిజాం నవాబులకు గులాములుగా దౌర్జన్యాలతో అనేక మంది ఊతకోత కోయటం మహిళలను వివస్త్రలుగా చేసి ఊరేగింపులు చేయడం, బతుకమ్మలు ఆడించటం, మానభంగాలు చేయటం లాంటి క్రూరమైన నేరాలు చేసిన జమీందార్లు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, హిందువులు, ముస్లింలు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జి.కృష్ణ, వి.శ్రీనివాస్, బి.కొమరయ్య, తాండ్ర లక్ష్మీనారాయణ, రాఘవేంద్రరావు, రవి, ఉబనేశ్వర్, భాస్కర్ పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా సెంట్రల్ లైటింగ్

- బీసీఎం రహదారిపై రాత్రిపూట అంధకారం
- రెండున్నరేళ్ల క్రితం ఏర్పాటు
- విద్యుత్ కనెక్షన్‌లో జాప్యం




జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ పోల్స్

పాల్వంచరూరల్: సెంట్రల్ లైటింగ్ కోసం విద్యుత్ పోల్స్ నిర్మించి రెండున్నరేళ్లు అయింది. అయినా నేటికీ వీధిలైట్లు కలగలేదు. పెద్దమ్మగుడి వద్ద శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. అధికారుల పర్యవేక్షణా లోపం నిర్లక్ష్యం కారణంగా సెంట్రల్ లైటింగ్ పనుల నిర్మాణంలో తీవ్రజాప్యం జరుగుతోంది. విద్యుత్ పోల్స్ లైట్లు ఏర్పాటు చేసినా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయలేదు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి నుంచి పెద్దమ్మతల్లి గుడి వరకు రూ.2.7 కోట్ల వ్యయంతో సీఎస్ఆర్ పాలసీ కింద 2022లో సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రెండున్నర సంవత్సరాలు గడిచినా నేటికీ లైటింగ్ వెలుగులు లేవు. పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీర్ విభాగం పర్యవేక్షణలో కొనసాగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులు ఆరు కిలోమీటర్ల పొడవున బీసీఎం జాతీయ రహదారి డివైడర్ మధ్యలో 135 విద్యుత్ పోల్స్ నిర్మాణం చేసి లైట్లను కూడా అమర్చారు. ఇంకా గుడి వద్ద హైమాక్స్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికి తోడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతోంది. ఇందిరా కాలనీ పెట్రోల్‌బంక్ నుంచి లక్ష్మీదేవిపల్లి, బస్వతారక కాలనీ, కేశవాపురం, పెద్దమ్మగుడి, జగన్నాథపురం గ్రామం వరకు లైటింగ్ పోల్స్‌ను ఏర్పాటు చేశారు.

చీకట్లో ప్రమాదాలు...

లక్ష్మీదేవిపల్లి నుంచి పెద్దమ్మగుడి వరకు డివైడర్ మధ్యలో సెంట్రల్ లైట్లు వెలగ పోవడం వలన రాత్రి సమయంలో బీసీఎం జాతీయ రహదారిపై ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉండే బీసీఎం జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించకపోవడం వలన లైటింగ్ పనుల్లో జాప్యం జరుగుతోందని ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సెంట్రల్ లైటింగ్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


చర్యలు తీసుకోవాలి..



బీసీఎం జాతీయ రహదారిపై రెండు సంవత్సరాల క్రితం సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేసినా ఇంతవరకు లైట్లు వెలగడం లేదు. రాత్రి సమయంలో వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి వెంటనే సెంట్రల్ లైటింగ్ వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

– విజయ్‌కుమార్, లక్ష్మీదేవిపల్లి

ఇబ్బందులు పడుతున్నాం..



ఇందిరానగర్ కాలనీ పెట్రోల్ బంక్ దగ్గర నుంచి జగన్నాథపురం వరకు బీసీఎం జాతీయ రహదారిపై రాత్రి సమయంలో లైటింగ్ లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. నిత్యం వాహనాల రద్దీ ఉండే మార్గంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు వెంటనే చర్యలు ప్రమాదాలను నివారించాలి.

– బి.బాలాజీ, జగన్నాథపురం

విద్యుత్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది..

లక్ష్మీదేవిపల్లి నుంచి పెద్దమ్మగుడి వరకు సెంట్రల్ లైటింగ్ పనులు తర్వగా పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకుంటాం. నిర్మాణ పనులు అయిపోయాయి. విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయకపోవడం వలన లైటింగ్ ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. విద్యుత్ అనుమతుల రావాల్సి ఉంది. దసరా వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– శివలాల్, పీఆర్ ఏఈ